రచన మాసపత్రిక : డిసెంబర్, 2008

**రచయిత చిట్టచివరి అముద్రిత కథ**

# ఎన్ని అను - మగవాళ్లు మగవాళ్లే!!

**అ**నసూయ అప్పుడు పార్కులో కూర్చుంది. ఆమె పక్కనే రామం ఉన్నాడు. వాళ్లిద్దరూ లోకంలో చాలా మందిలా ప్రేమికులు. వాళ్ళ మాటల్లో, ప్రవర్తనలో ఎప్పుడూ ప్రేమ దొర్లుతూనే వుంటుంది! అయితే లోకసహజంగా అనసూయ రామాన్ని కొద్దికొద్దిగా అనుమానిస్తుంది. అది ఆమె పెళ్ళికాని యువతి మూలంగా అతి సహజంగా వచ్చే భయం

లేదా అనుమానం.

"అనసూయా! నేను నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. నన్ను నమ్ము"

"ఈ మాటలు చాలామంది అన్నారు, నాతో! ఇప్పటికీ వేంకటేశ్వర్లు, ఇంకా చాలామంది ఈ మాటలే విన్పిస్తున్నారు..."

"మనిద్దరికీ రెండేళ్ళ పరిచయం ఉంది. నా మాటలు, హృదయం బాగా తెలిసిన దానివి. నేను ఏది మాట్లాడినా హృదయం నుంచే మాట్లాడతాను!"

అనసూయ పకపకా నవ్వింది. ఆ నవ్వులో జవాబు ఉందనుకోవాలో, లేదనుకోవాలో ఆ నవ్వునే అడగాలి. కానీ అది కుదిరేది కాదుగా!

"నవ్వద్దు అనసూయా! నన్ను ప్రేమిస్తున్నానని చెప్పు. నన్ను అర్థం చేసుకున్నానని చెప్పు. నాతో నీ చేయి కలుపుతానని చెప్పు – చాలు"

"బావుంది. నేను ఎలా మాట్లాడాలో, ఏం మాట్లాడాలో చెబుతున్నావ్... రేపు నీ భార్య అవగానే నీ ప్రతి మాటకు తల ఊపే తత్వం అలవాటు చేస్తావేమో?" నవ్వుతూ అంది అనసూయ.

"నిన్ను చూసిన తర్వాత ఎవరైనా సరే నీ ముందు తలవంచుతారు.... నీకు తల ఒగ్గుతారు తప్పించి పొగరుమోతుతనాన్ని ప్రదర్శించరు. నీ మాటల్ని తలదాలుస్తారు కాని వాటిని ఊకదంపుడు ఉపన్యాసాలుగా కొట్టపారవెయ్యరు"

"నీకు మాట్లాడడం చాలా బాగా వచ్చు"

"నిన్ను చూసిన తర్వాత, నీతో స్నేహం పెరిగిన తరువాత నా అక్షరాలకు అందం ఒకటే కాదు... భావన.... ఇంకా, ఇంకా, నిజాయితీ గట్రా అలవడ్డాయి"

"అలానా?"

"ఇది నీ గొప్పా, నీ హృదయం గొప్పా... నీ స్నేహం నాకిచ్చిన వరం"

అనసూయ నవ్వింది. చటుక్కున ఆమె హృదయంలోకి అపుడు వేంకటేశ్వర్లు వచ్చి చోటుచేసుకున్నాడు. అనసూయ కాదనలేకపోయింది. తప్పు అయినా ఆమె తప్పించుకోలేకపోయింది. అశక్తురాలయింది. అబల అయ్యింది.

❖ ❖ ❖

వేంకటేశ్వర్లు ఏనాడూ గుడికి వెళ్ళలేదు. తనకు కావల్సింది – ఎంత ముఖ్యమైనదయినా, ఆ అవసరం ఎంతటి ప్రాముఖ్యమైనది అయినా, అతను దేవాలయం మెట్లు కూడా తొక్కలేదు!! భగవంతుని ముందు అయిన దానికీ, కాని దానికీ చెయ్యి జాపి ఆయన్ను విసిగించటం తప్పని అతని భావన. ప్రతి చిన్నా చితకా పన్లు చేసిపెట్టడానికి ఆయన్ను 'డిస్టర్బ్' చేయడం నేరం అని వేంకటేశ్వర్లు ఎప్పుడూ అంటాడు!

ఆవేళ వేంకటేశ్వర్లు ఆఫీసుకు బయలుదేరుతూంటే అతని స్నేహితుడు రామం అలవాటుగా వచ్చాడు. రామం – వేంకటేశ్వర్లు కొలీగ్. ఒకవిధంగా ప్రాణస్నేహితుడి

లాంటివాడే!

"ఏం నాయనా ఆఫీసుకు తయారయ్యావా? దుమ్మా కొడ్తున్నావా?"

"లేదు రామం... ఈ వేళ బుద్ధిమంతుడిలా ఆఫీసుకే రావాలనుకుంటున్నాను"

రామం నవ్వేసి, ఓసారి తన చేతికున్న వాచీ చూసుకొని, "నీకో మాట చెప్పాలని బయలుదేరేముందు ఓ గట్టి నిర్ణయానికి వచ్చాను. ఇక నీ అనుమతి తీసుకుని ఆ విషయం నీతో చెప్పాలని ఫైనల్‌గా అన్పించింది"

'నీ బొందేం కాదు. చెప్పు! నువ్వేది చెప్పినా, ఏం మాట్లాడినా అవన్నీ నేనే కాదు, నీ దేవుడూ వింటాడని గుర్తుపెట్టుకో. కల్పితాలూ, కథలూ చెప్పి నన్ను బురిడీ కొట్టిస్తే ఆయనగారు ఊరుకోడు. నిన్ను మూడు చెరువుల నీళ్ళు తాగిస్తాడు. జాగ్రత్త!"

"అలానా" అంటూ నవ్వేశాడు. తిరిగి అన్నాడు.

"ఎవరైనా సరే నిజం చెప్పడమే గొప్ప. అదే దేవుడు ఇష్టపడేది. మాట్లాడితే అబద్ధాలు చెప్పేది, ఆ తర్వాత ఆ తప్పుల్ని క్షమించమని దేవుడ్ని ప్రార్థించేది – ఇలా బొమ్మా బొరుసుగా బ్రతికేవాళ్ళంటే ఆయనకు పెద్దగా ఇష్టం వుండదుట... ఇది నా పెద్దలు నాకు నేర్పిన పాఠం"

"ఆ విషయం వదిలేయ్ కాసేపు! కానీ ఈవేళ నేను నీకు ఓ కొత్త విషయం చెప్పబోతున్నాను. జాగ్రత్తగా విను! మా పక్క గదిలోకి అమ్మాయిలు దిగారు.... అద్దెకేలే! అందులో ఒకళ్ళిద్దరు అమ్మాయిలు మెరికల్లా ఉన్నారు. వాళ్ళ అందం తలుపు తట్టి, కల్పించుకుని ఎలాగైనా వాళ్ళతో మాట్లాడమంటుంది... కానీ భయం వుందే – అది నా చేత వెనకడుగు వేయిస్తోంది. ఏం చెయ్యాలి?"

వేంకటేశ్వర్లు అంతా విని తేలిగ్గా నవ్వేశాడు.

"అందులో ఓ అమ్మాయీ మరీ బాగుంది. నాకు చాలా చాలా నచ్చింది. ఆమె పేరు మంత్ర. నేను మరెక్కడా ఆలోచించకుండా దేనిగురించీ మాట్లాడకుండా చేస్తోంది. ఇందులో అబద్ధం ఏమీ లేదు. ఇది నెలగా జరుగుతోంది. ఇవన్నీ అనుకోకుండా జరిగిపోయాయి – ఈ నెలలో! ఏం చెప్పను..." అంటూ పెద్ద కథ చెప్పాడు.

వేంకటేశ్వర్లు అంతా విని పొట్ట చేతపట్టుకుని నవ్వుతూనే వున్నాడు.

"ఆ అమ్మాయి ఆ గదిలోకి ప్రవేశించింది. అందుకే కాబోలు ఆ ఇల్లు, వాకిలి, చుట్టు పక్కలా కొత్త వెలుగుతో విరబూశాయి. అవి హృదయం ఉన్నవాళ్ళను పట్టుకొని తమ వంతు కలవరపెడుతున్నాయి. అందులో నేను మొదటి వాణ్ణి అయ్యాను. ఇప్పుడు నాకు లోకం ఇదివరకులా కన్పించడం లేదు. అంతా కొత్తగా ఉంది!"

"నీ మొహం"

"నా మొహం అని నువ్వు కొట్టిపారేయ్యద్దు ప్లీజ్... అందగత్తెల్ని చూసి సామాన్యంగా నేను జావగారే రకాన్ని కాదు... కానీ ఆ అమ్మాయి ఓ మంత్రగత్తెలా నా నైజాన్ని మార్చింది!

నన్ను మార్చింది! నా పరిస్థితుల్ని మార్చింది! ఓ ఆడదాన్ని గురించి ఆలోచించేవాడిగా, ఓ అందగత్తె గురించి ఆరాటపడేవాడిగా నన్ను తీర్చిదిద్దింది. ఇదే నాకు కొత్తగా ఉంది"

"ప్లీజ్... ప్లీజ్" అని వేంకటేశ్వర్లు రామాన్ని ఆపాడు.

కానీ ఉప్పొంగే రామం ఆలోచనల్ని ఆపడం అతని తరం కాలేదు.

❖ ❖ ❖

కొంతమంది వ్యక్తుల జీవితాలకు, కథలకూ అసలు పోలికే లేదని - ఇదంతా కథలు వ్రాసే వాళ్ళ ఊహ అని, అది వారి ఆర్భాటానికి ఓ చిహ్నమని అంటారు. కానీ ఈ మాటలు వేంకటేశ్వర్లు ఒప్పుకోడు. కొట్టిపారేస్తాడు. కథల్లో పాత్రలు పడే బాధల కన్నా, లేకపోతే వాళ్ళు తలదాల్చే సుఖాల కన్నా ఎక్కువగా ఈ మనుషులూ అనుభవిస్తారనీ - కానీ అవి అంతగా బయటకు రావనీ వేంకటేశ్వర్లు అంటుంటాడు. ఎంతో నమ్మకంగా, నమ్రతతో చెప్తాడు. అన్నీ విన్న తర్వాత విన్నవాళ్ళు గుండె చేతబట్టుకుంటారు. ఊపిరి తీయలేరు - చాలాసేపు!

వేంకటేశ్వర్లుకు ఈ అనుభవం ఒట్టినే రాలేదు. ఇది కల్పితమూ కాదు. జీవితం అతని కన్నా పెద్ద పాత్రను తీసుకొని అనుభవాలు, కష్టాలు అందించడం మూలంగానే ఇది జరిగింది! ఈ అనుభవాలూ, కష్టాలే అతన్ని నెమ్మదిగా మార్చాయి. చూస్తుండగానే తల్లీదండ్రీ పోయారు. ఉద్యోగం లేదు. అద్దె ఇల్లు గాలివానలో పడ్డ కలుపు మొక్కలా నేలని తాకడం, ఏడ్వటం అతని వంతు అయింది. బ్రహ్మజెముడు మొక్కగానూ చేశాయి. ఆపైన అతనికి చుట్టూతా, అంతటా నిత్యం కన్పించే దేవుడు అంటే అపనమ్మకమూ ఏర్పడింది! అతను నెమ్మదిగా తన వ్యక్తిత్వాన్నే కాదు - దేవుడి మీద నమ్మకాన్నీ పోగొట్టుకొనడం మొదలు పెట్టాడు! దేవుడంటేనూ, దేవుడి గుడి అంటేనూ అతనికి చిన్నపాటి ఏవగింపు కూడా కలగసాగింది!

ఆవేళ వేంకటేశ్వర్లు ఆఫీసుకు వెళ్ళే సమయంలో అలవాటుగా రామం అక్కడికి వచ్చాడు.

రామాన్ని చూసి చిన్నగా నవ్వి వేంకటేశ్వర్లు, "కూర్చో" అన్నాడు.

రామం కాసేపు ఎక్కడో ఆలోచించి, తనలో తానుగా కిందా మీదా పడి, "నీకో మాట చెప్పనా?" అన్నాడు ఎంతో తీయగా.

"చెప్పు... అంతకన్నానా, నాకు వినడానికి ఏ ఇబ్బందులూ లేవు!" అన్నాడు వేంకటేశ్వర్లు నెమ్మదిగా.

"ఎవరి గురించి చెప్పినా నువ్వు ముందే 'సారీ' అనకూడదు"

"భగవంతుడి గురించి కాకుండా, ఎవరి గురించి అయినా చెప్పు"

"నీ సంగతి నాకు తెలియదా... పదే పదే నేను నిన్నెందుకు బాధపెడతాను? ఈసారి చెప్పేది అమ్మాయిల గురించి. అదీ కొత్త అమ్మాయిల గురించి..."

"అట్లానా..." అన్నాడు ఉత్సాహంగా వేంకటేశ్వర్లు.

"మా పక్కగదిలోకి అద్దెకు కొత్తగా అమ్మాయిలు దిగారు అని చెప్పాను గదా. నేను అందర్నీ చూశాను. కానీ పరకాయించి ఎవర్నీ చూడలేదు. నాలుగు రోజుల క్రితం చూశాను. అందులో ఓ అమ్మాయి ఆశ్చర్యంగా అత్యద్భుతంగా ఉంది. ఈసారి ఒకటి రెండు సార్లు చూశాను. నేను చేస్తున్న పని తప్పని నాకు తెలిసినా నేను హద్దు మీరి ముందుకు వెళ్ళలేదు. కళ్ళు నులుముకొని చూశాను. ఆవేశాన్ని, కామాన్ని, వికారాలను బుద్ధిమంతుడిలా పక్కకి తోసి పరీక్షగా చూశాను. అయినా ఆ అమ్మాయి అప్సరసే ... ఆశాలతే... తిలోత్తమే... ఆమెను చూసి, చూపును మరల్చుకోలేకపోయాను. కానీ అంతలోనే నా గురించి నాకు జ్ఞాపకం వచ్చింది. అందవికారంగా వున్న నన్ను నేను గుర్తుకు తెచ్చుకుని కిందా మీదా అయ్యాను. ఆమె పేరు తెల్సుకుంటేనే నా అభిమానానికి అర్థం ఉంటుందనిపించింది. ఆమె పేరు రాధ అని నా వాకబులో తేలింది"

వేంకటేశ్వర్లు ఆ మాటలకు ఏమీ కాలేదు. నవ్వుకుంటూనే వింటూ చేతులు కలుపుకున్నాడు పదే పదే!

"అందగత్తెల గురించి, ప్రేమల గురించి మాట్లాడే హక్కు నాకు లేదని జ్ఞాపకం వచ్చింది. బాధపడ్డాను. అయినా దాన్ని నేను భరించక తప్పదు. అందుకే అందగత్తెలను చూసి సామాన్యంగా నేను నీరుకారిపోను. కారణం నాకే కాదు, చాలామంది స్నేహితులకూ తెలుసు. నిజమే! భగవంతుడు నాకు అనాకారితనాన్ని ఇచ్చి నన్నో పక్కన పెట్టాడు. నన్ను ఏమీ చేయలేని అశక్తుడిగా వుంచేశాడు. నాచేత – అందుకే ఆయన ఎప్పుడూ తిట్లు తింటూ ఉంటాడు. నిత్యం నాకు ఇదో కార్యక్రమం అయిపోయింది.... ఆ భగవంతుడూ, నేను ముఖాముఖిగా కల్సుకుంటే నేను ఆయన్ను కడిగిపారేస్తే – నా కోపాన్ని ఆయనతో భేటీపడి తీర్చుకోగలిగితే నాకు మనశ్శాంతి దొరికేదేమో?? చూడు ఆశ్చర్యం. ఆ భగవంతుడు – తన మానాన తను ఊరుకోకుండా ఆ అనసూయను నాకెందుకు కలపాలి? ఈ ఉపకారం చేయమని నేనెప్పుడూ ఆయన్ను కోరలేదే. అయినా ఆయన అనసూయను నాకు కలిపాడు. ఆయనకు కృతజ్ఞతలు అందజేయడం నాకు తప్పనిసరా??"

వేంకటేశ్వర్లు అప్పటికే కలవరపడుతున్నాడు. వేయి వంకరలు తిరిగిపోతున్నాడు. మొహమంతా కళ, ఔన్నత్యం బదులు అశాంతి, అయిష్టం – ఇంకా ఇంకా జలసీలతో నిండిపోతోంది... తను ప్రాణప్రదంగా ప్రేమించి, ఆపైన ఎన్నో రోజులుగా పూజించిన అనసూయ గురించి రామం మాట్లాడ్డం – అతని మాటలంటే ఎలా ఉంటాయో తెలియజెప్పినట్లయింది. క్రోధం ఉప్పొంగితే మనిషి దిగజారతాడంటారు. వేంకటేశ్వర్లు అదే పరిస్థితిలో ఉన్నాడు – అప్పుడు!!

❖ ❖ ❖

"నువ్వు ఎప్పుడూ నా పక్కనే నిలబడి వుండు చాలు... నీ ప్రతీమాట నేను నా తలకెత్తుకుంటాను, నీ గురించి నేనేమయినా అవుతాను - నిజం..." అంది చిన్నపిల్లలా అనసూయ.

ఆ మాటలు రామం విన్నాడు. కానీ ఆ మాటల్లోని ఏ అక్షరం అతని గుండెల్ని తాకలేదు. అతను మనిషీ కాలేకపోయాడు.

తిరిగి ఈ కలియుగంలో కూడా ప్రేమ పూర్తిగా మునిగిపోయిన ఆయనతోను మరోసారి...

భక్తులకు హృదయాన్ని పంచియివ్వడంలో దిట్ట అయిన దేవుడు చాలాసార్లు తప్పిదాలు చేస్తాడని మనకు తెలుసు.

కానీ ఆమె మాటలు పరాగ్గా వున్న దేవుణ్ణి తాకాయి. ఓ ప్రాణి హృదయాన్ని నిష్కల్మషంగా చేసుకొని సర్వం మరిచి అడిగిన దానిని ఆయన తిరస్కరించలేకపోయాడు.

వెనకా ముందు చూడకుండా, "నేను ఉన్నానుగా" అనేశాడు.

ఇదే దేవుడికి సమస్యయి కూర్చుంది తర్వాత!.... అప్పుడు దేవుడు - ఆ క్షణాన మనుషుడయి మిన్నబోయి - తల వంచుకున్నాడు, ఏం చేయలేక!!

వేంకటేశ్వర్లు ఇప్పుడు పూర్వపు వేంకటేశ్వర్లు కాదు. అతను అవమానంతో కాగిపోయి ఉన్నమూలంగా బాగా బంగారు కణికలాగా ప్రకాశించే అతను ఆ సమయాన పాత రాగిముక్కలా అయిపోయాడు! అందుకే అతనికి రామం గర్భశత్రువుగా కన్పించసాగాడు. రామంతో స్నేహాన్ని వదులుకొని దూరంగా పోవాలనే ఆశ అతనికి మనశ్శాంతి ఇవ్వలేదు. రామాన్ని నిలువునా చంపాలనీ అన్పించింది. రామం వెళ్ళిపోయిన తర్వాత కోపం ఆపుకోలేక పైకి అనేశాడు.

"వాడు, ఆ రామంగాడు మళ్ళీ నా రూమ్‌కు వస్తే అనసూయ దగ్గరకు కాదు - తనింటికే తను వెళ్ళలేడు" - అని!

అయితే వెళ్ళినంత తొందరలోనే రామం తిరిగి అక్కడకు వచ్చాడు. రామాన్ని చూసి, వేంకటేశ్వర్లు విభ్రాంతి జెందాడు. అందుకే ఏం మాట్లాడాలో మర్చిపోయి - మాటలు రానివాడిలా మూగగా అయిపోయాడు. కోపాన్ని, బాధను, అవమానాన్ని దాచుకోవడం తెలియక కలవరపడసాగాడు!

రామం వేంకటేశ్వర్లుని పరీక్షగా చూసి, ఆశ్చర్యపోయి - "అదేమిటి నువ్వు గంట క్రితం వేంకటేశ్వర్లులా కనిపించడం లేదు. ఏమయింది నీకు సడెన్‌గా..." అంటూ రామం వేంకటేశ్వర్లు నుదురు చేత్తో తడిమాడు.

"జ్వరం కాదు... నన్ను పగ వెంటాడుతోంది రామం! అది చెయ్యి, ఇది చెయ్యి.

నువ్వేం చెప్పినా తప్పు లేదు... దెబ్బతిన్నవాడు – దెబ్బకొట్టడం అతి సహజం అని నొక్కి చెప్తోంది..."

రామం కాసేపు ఆశ్చర్యంగా చూసి, చిన్నగా నవ్వి, "నీకు వెర్రి అనుకుంటాను!" అన్నాడు నెమ్మదిగా.

"అవునులే... నువ్వు ఎన్నయినా అనగలవు. ఎదటి వాళ్ళకి ఏ ప్రిస్క్రిప్షన్ అయినా ఇవ్వగలవు!"

రామం కాసేపు సూటిగా వేంకటేశ్వర్లు మొహంలోకి చూసి, "వేంకటేశ్వర్లూ! నీ బాధ నాకు తెలిసింది. అనసూయను నేను ప్రేమించడం, ఆమె నేనంటే ఇష్టపడ్డం నీకు నచ్చలేదు. నీలో..." అని ఆగిపోయాడు రామం.

"అవును అనసూయను నేను ప్రేమించాను. నా ప్రేమికురాలి గురించి నువ్వు మాట్లాడ్డం నాకు బాధ అన్పించడం ఒకటే – నిన్ను ...... నిన్ను....!!"

"నిన్ను పగ వెంటాడుతోంది..."

"చాల్లే...."

"నవ్వుతావు. గేలి చేస్తావు... గట్టెక్కిన వాడు నీలాగే ప్రవర్తిస్తాడు. నువ్వు స్నేహితుడివి కాదు... నాకూ అనసూయకూ మధ్యన ఉన్న ప్రేమ, దాని సారాంశం మొత్తం నీకు తెలుసు... అయినా నువ్వు...."

రామం నవ్వేశాడు. మామూలుగా కాదు – పగలబడి. అయినా నవ్వు ఆపుకొని అన్నాడు.

"వేంకటేశ్వర్లూ... ఓ నిజం చెప్తున్నాను విను. నేనూ అనసూయా ప్రేమించుకోవడం వట్టిది! ఇది మేం ఇద్దరం కలిసి నీ నిజాయితీనీ, చొరవనూ, ఆపైన నీ ప్రేమనూ తెల్సుకునేందుకు చేసిన ప్రయత్నమే!! అంతా నాటకం... నా మాట నమ్ము. నేను ఒట్టు వేసి నీ మీద నమ్మకంతో, ఏనాడూ నువ్వు నన్ను అనుమానించవని, అపార్థం చేసుకోవని, నాకోసం హృదయం ఇచ్చేవాడివనీ గొప్ప పందెం కాశాను... నీ మీద నాకంత నమ్మకం. నేను వేయి రూపాయలు పోయాయని కించెత్తు బాధపడను. కానీ నువ్వు నన్ను నేలబారు మనిషిగా చేసి ఆలోచించినందుకు బాధగా ఉంది. నేను ఓడిపోయినా ఆ నిజం అనసూయకు తెలియాలి... మగవాళ్ళ మనస్తత్వం మీద ఆమె చేసిన సవాల్ ఈ ఇరవై ఒకటవ శతాబ్దంలో కూడా పూర్వంలాగే ప్రకాశిస్తూనే ఉందని ఆమెకు మరోసారి చెప్పాలి. మగవాళ్ళు మగవాళ్ళేనని – ఆడవాళ్ళు ఆడవాళ్ళేనని ఆమె చేసిన వ్యాఖ్య నిజం... ముమ్మాటికీ నిజం అని ఆమెతో చెప్పాలి!!"

❖